

పోలింగ్ తర్వాత వైసీపీ మూకలు తగలబెట్టిన కారు

పల్నాడు వదిలి.. పరార్!





మహిళపైనా పిన్నెల్లి దౌర్జన్యం..

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్లి ఈవీఎంను నేలకేసి కొట్టి వీధి రౌడీలా ప్రవర్తించారు. ఈ ఘటనపై పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యేను ఓ మహిళ నిలదీశారు. ఈ క్రమంలో పిన్నెల్లి ఆమెపై దుర్భాషలాడారు. దౌర్జన్యం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



పాలువాయిగేట్ గ్రామంలోని 202 పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మల్లికా గార్గ్



పోలింగ్ తర్వాత రోజు వైసీపీ మూకల దాడులు

అవును.. ఇన్నాళ్లికి పాపం పండిందంటున్నారు బాధితులు. ఇన్నాళ్లు చంబల్‌లోయను తలపించే అరాచకం మాచర్ల నియోజకవర్గంలో జరిగిందని చెబుతున్నారు. పిన్నెల్లి సోదరులు చేసిన విధ్వంసాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎమ్మెల్యే ఏకంగా పోలింగ్ బూత్‌లో ఈవీఎం విధ్వంసం చేస్తున్న వీడియో కలకలం రేపింది. ఓటమి భయంతో బూత్‌లలోకి చొరబడి దాడులకు తెగబడిన దృశ్యాలు వారి అరాచకానికి పరాకాష్టగా నిలిచాయి. ఈవీఎం విధ్వంసం కేసులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు సమాచారం.. హైదరాబాద్‌లో పోలీసులు పిన్నెల్లిని బుధవారం అదుపులోకి తీసుకున్నారని ప్రచారం... ఈ రెండూ నిర్ధారణ కాకపోయినా రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యవహారం సంచలనం రేకెత్తించింది.


ప్రాణ భయంతో పాలాల్లో దాక్కున్నా..

- పాల్వాయి గేటు పోలింగ్ బూత్ టీడీపీ ఏజెంట్ శేషగిరిరావు

గుంటూరు, మాచర్లటౌన్: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన రౌడీ మూకలతో రాడ్లు, కర్రలు, గొడ్డలి, మారణాయుధాలతో నాపై దాడికి దిగారు.. నా తలపగిలినా వదిలిపెట్టకుండా మారణాయుధాలతో దాడి చేస్తుంటే ప్రాణ భయంతో పొలాల్లోకి పరుగులు తీశా.. పిన్నెల్లి సోదరుల నుంచి నాకు, నా కుటుంబానికి ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించండి.. అంటూ పాల్వాయి గేటు గ్రామానికి చెందిన టీడీపీ ఏజెంట్ నంబూరు శేషగిరిరావు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులోని టీడీపీ మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఫోన్లో పరామర్శించిన చంద్రబాబు

ఎమ్మెల్యే అభ్యర్థి పీఆర్కే ఈవీఎం ధ్వంసం, శేషగిరిరావు ధైర్యంగా అడ్డుకోవడం వంటివి మీడియా ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబు తెలుసుకున్నారు. టీడీపీ నేత చప్పిడి రాము ఫోన్ ద్వారా శేషగిరిరావును టీడీపీ అధినేత చంద్రబాబు పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.



- పిన్నెల్లి బ్రదర్స్ కోసం పోలీసుల వేట

- ఈవీఎం విధ్వంసం చేసిన ఎమ్మెల్యే పిన్నెల్లి
- వీడియో వెలుగులోకి రావడంతో పరారీ
- హైదరాబాదులో గాలిస్తున్న ఏపీ, తెలంగాణ పోలీసు బృందాలు
- పోలీసుల అదుపులో ఉన్నాడంటూ వదంతులు
- నిర్ధారించని పోలీసులు
- సినిమా ఫక్కీలో పిన్నెల్లి కోసం పోలీసులు ఛేజింగ్

నరసరావుపేట, మే 22: పోలింగ్ రోజు ఈవీఎం, వీవీప్యాట్లను ధ్వంసం చేసి అరాచకం సృష్టించిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీలో ఉన్నాడు. హైదరాబాదులో పోలీసులు పిన్నెల్లిని బుధవారం అదుపులోకి తీసుకున్నారని ప్రచారం. అయితే పోలీసుల అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించలేదు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విశ్వప్రయత్నాలు చేశారు. పట్టుకునేందుకు పోలీసులు కూడా అదే రేంజ్ వేటాడుతున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్ పిన్నెల్లిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పిన్నెల్లి విదేశాలకు పారిపోయేందుకు యత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానంతో అన్ని ఎయిర్ పోర్టులలో ఏపీ పోలీసులు అప్రమత్తం చేశారు. లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

పిన్నెల్లిని శాశ్వతంగా రాజకీయ బహిష్కరణ చేయాలి: జూలకంటి

ఈవీఎంను పగలగొట్టిన ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని రాజకీయాల నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. అరాచకాలకు పాల్పడిని వైసీపీ నేతలను కౌంటింగ్ ఏజెంట్లుగా కూడా అనుమతించ కూడదని చెప్పారు. ఈసీ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎస్ జవహర్‌రెడ్డి కనుసన్నల్లో వైసీపీ మూకలు దాడులకు యత్నిం చాయని బ్రహ్మారెడ్డి ఆరోపించారు.

పది సెక్షన్లతో కేసుల నమోదు..

ఐపీసీ, ప్రజాప్రాతినిధ్య చట్టం, పీడీపీపీ చట్టాల పరిధిలో 10 సెక్షన్లతో పిన్నెల్లిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. 143, 147, 448, 427, 353, 452, 1202, చట్టం 131, 135 సెక్షన్లతో కేసులు నమోదయ్యాయి. 20న పిన్నెల్లిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. పిన్నెల్లిపై అదనపు సెక్షన్లు కూడా పెట్టేందుకు కోర్టులో మెమో పోలీసులు దాఖలు చేశారు. పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు కూడా నమోదు చేసే అవకాశం ఉంది. ఈవీఎంల ధ్వంసం ఘటనపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు ఎందుకు ఎమ్మెల్యేను అరెస్టు చేయలేదని మండిపడింది. పిన్నెల్లిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించింది. ఈ ఘటనపై వెనుంటనే నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు సీఈవో ముకేశ్ కుమార్‌కు ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

వెబ్ కెమెరాలో దృశ్యాల పరిశీలన

ఈ ఘటనకు సంబంధించి వెబ్ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను కేంద్ర ఎన్నికల అధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ విషయాన్ని ఈసీ చాలా తీవ్రంగా పరిగణించింది. ఈ వీడియో బయటికి రాకముందు మాచర్ల నియోజకవర్గంలో ఎక్కడా గొడవలు చేయలేదని ఎమ్మెల్యే పిన్నెల్లి బుకాయించాడు. మాచర్ల అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆర్వో.. పిన్నెల్లి చేత ప్రమాణం చేయించారు. ఎన్నికల నిబంధనలను అనుసరిస్తానని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానని ప్రమాణం చేశారు. ఇందుకు విరుద్ధంగా ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లిని ఎన్నికల నియమావళి ప్రకారం కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పోలింగ్ రోజు ఈవీఎంలను పగలగొడుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి

అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..

పోలింగ్ రోజున పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. టీడీపీ శ్రేణులపై దాడులతో పాటు ఓటమి భయంతో పిన్నెల్లి సోదరులు బూత్‌లలోకి స్వయంగా చొరబడి ఈవీఎంలను ధ్వంసం చేసిన దృశ్యాలు కలకలం రేపాయి. రెంటచింతల మండలంలోని పాల్వాయి గేటులో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుండగా.. అక్కడ టీడీపీకే ఎక్కువ ఓట్లు పోలవుతున్నాయని.. తనకు ఓట్లు వేయడం లేదన్న అక్కసుతో పిన్నెల్లి బరితెగించారు. 202వ నంబర్ పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి.. ఈవీఎంను ఎత్తి నేలకేసికొట్టారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంటు శేషగిరిరావుపై, ఆయన అనుచరులు దాడి చేశారు. ఆ ఏజెంట్‌పై అదేరోజు బూత్ బయటే గొడ్డలితో దాడి చేశారు. మరోవైపు.. మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్ రోజు, ఆ మర్నాడు జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పిన్నెల్లి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిని 14న గృహ నిర్బంధం చేశారు. కానీ అదే రోజు అర్ధరాత్రి వారిరువురూ ఇంటి నుంచి పరారయ్యారు. కాగా పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రం అంత సమస్యాత్మకం అయినప్పటికీ ఇద్దరే పోలీసులు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆ అధికారి నివేదిక ఎందుకు ఇవ్వలేదు..

పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించారు. మాచర్ల నియోజక వర్గానికి డీపీవో విజయ భాస్కరరెడ్డిని ప్రత్యేక అధికారిగా నియమించారు. మాచర్ల నియోజక వర్గంలో పోలింగ్ బూత్‌లలో ఈవీఎంల ధ్వంసం చేయడానికి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికను సదరు అధికారి ఇవ్వలేదని తెలిసింది. ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేయడం కూడా కంట్రోల్ రూం నుంచి పరిశీలించిన అధికారులు ఏమీ తెలియనట్టు మిన్నకున్నారు. ఈ అంశంపై కూడా విచారిస్తున్నట్టు తెలిసింది.

దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్

రామకృష్ణారెడ్డి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ వేసుకున్నాడని, అయితే వ్యూహం బెడిసి కొట్టిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం 1.20 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నాడని, అయితే మధ్యా హ్నం 12 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ ఎయిర్ పోర్ట్‌లో ఏపీ పోలీస్ టీమ్ మాటు వేసిం దని తెలుసుకొని వెళ్లలేదని టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా పోలీసులు ఎయిర్ పోర్టులో ఉన్నారనే విషయం తెలుసుకున్న పిన్నెల్లి తప్పించుకునేందుకు రూట్ మార్చినట్టు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో కారు డ్రైవర్

పిన్నెల్లి కదలికలను పోలీసులు ట్రాక్ చేస్తుండడంతో సంగారెడ్డి జిల్లా కంది వద్ద కారు, డ్రైవర్, మొబైల్‌ను వదిలేసి వేరే వాహనంలో పరారు అయ్యారని సమాచారం. దీంతో కారు డ్రైవర్, గన్‌మెన్‌లను పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డికి ఆశ్రయం ఇచ్చినవారిని కూడా అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తునట్టు తెలుస్తోంది.

పోలింగ్ రోజున ఏం జరిగిందంటే..

13వ తేదీన ఎన్నికల పోలింగ్ రోజు రెంటచింతల మండలం పాల్వాయిగేటు 202 పోలింగ్ బూత్‌లో వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన విధ్వంసంపై శేషగిరిరావు మాటల్లో... పోలింగ్ రోజున తాను టీడీపీ ఏజెంట్‌గా ఉన్నా. రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లో జొరపడి దుర్భాషలాడుతూ ఈ బూత్‌లోనే కదా టీడీపీకి అనుకూల ఓట్లు పడుతుంది అంటూ ఈవీఎంను నేలకేసి కొట్టి ధ్వంసం చేశారు. నేను ధైర్యంగా ఎదురునిలిచి రామకృష్ణారెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేశానన్నారు. అదే రోజున రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ రౌడీ మూకలు నా తలపై వేటు వేశారు, అంతటితో ఆగకుండా చేయి, కాళ్లు, నడుముపై రాడ్లతో దాడి చేశారు. గాయాలపాలైన నేను రక్షించండి అంటూ కేకలు వేయడంతో ఓటు వేయడానికి వచ్చిన గ్రామస్తులందరూ ఎమ్మెల్యే పీఆర్కేను నిలదీశారు. అయినా అతను, అతని అనుచరులు జనంపై కూడా రాళ్ల దాడి చేశారు. ఆ రోజు నుంచి అజ్ఞాతంలోకి వెళ్లి బుధవారం బయటకు వచ్చానన్నారు. తీవ్ర గాయాలపాలైన నేను అదే రోజున పొలాల్లోకి వెళ్లి బిక్కుబిక్కుమంటూ జీవించానని చెప్పారు. ఆర్ఎంపీ డాక్టర్ సాయంతో చికిత్సను పొందా. తలకు కుట్లు కూడా పడ్డాయి. పీఆర్కేను అరెస్టు చేస్తారని తెలిసి అజ్ఞాతం వీడి బయటకు వచ్చా. పీఆర్కే నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, కనపర్తి శ్రీనివాసరావు సహకారంతో డీజీపీని కలిసి వాస్తవాలు వివరించి ప్రాణ రక్షణ కల్పించాలని కోరనున్నానని చెప్పారు. అనంతరం బ్రహ్మారెడ్డి, కనపర్తి, టీడీపీ నేతలతో కలిసి ఆయన ఎస్పీ తుషార్ డూడికి తన సమస్యను వివరించి, రక్షణ కల్పించాలని కోరారు.

ఈవీఎం ధ్వంసంపై నిర్లక్ష్యంగా ఎఫ్ఐఆర్ నమోదు

పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసినా ఇందుకు సంబధించిన కేసుల నమోదులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. రెండ్రోజుల పాటు పోలీసులు కోరినా పీవో ప్రైడింగ్ అధికారి ఎమ్మెల్యే చంపుతారనే భయంలో ఫిర్యాదు చేయలేదంటున్నారు. 13న జరిగిన ఈవీఎం ధ్వంసం ఘటనపై 15న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులు ఈవీఎం ధ్వంసం చేసినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించారని సెక్షన్లు నమోదు చేశారు. ఐపీసీ 448 పీపీడీప చట్టంలోని సెక్షన్ 3, ఐపీసీ 427 ఆర్‌డబ్ల్యూ 34 కింద కేసు పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు అని వీఆర్ఓ పేర్కొనడంతో వెబ్ కాస్టింగ్ ఫుటేజ్ కావాలని పోలీసులు ఈసీకి లేఖ రాశారు. పోలీసుల లేఖతో సీసీ టీవీ ఫుటేజ్ ఎన్నికల సంఘం ఇచ్చింది. ఈ ఫుటేజ్ వెలుగు చూడటంతో పిన్నెల్లి సాగించిన విధ్వంసకాండ, ఈవీఎంల ధ్వంసం వెలుగు చూసింది.

పోలా.. పరువు పోలా!

- ఏమీ జరగనట్టు నటించారు
- అరాచకాలను కప్పెట్టారు.. అడ్డంగా దొరికిపోయారు
- పిన్నెల్లి ప్రజలకు ఇప్పుడేమి సమాధానం చెబుతారు

నరసరావుపేట, మే 22: పోలింగ్ రోజు అరాచకాలు యథేచ్ఛగా జరిగాయి. వైసీపీ గుండాలు పేట్రేగిపోయాయి. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఓ వీధి రౌడీ మాదిరి ఏకంగా ఈవీఎంలనే ధ్వంసం చేశాడు. ఇంత పెద్దఎత్తున హింసాత్మక సంఘటనలు జరిగితే ఏమీ జరగనట్టుగా సంబంధిత అధికారులు వ్యవహరించారు. ఏమీ జరగనట్టు అంచా గప్‌చుప్‌గా ఉన్న ఎన్నికల యంత్రాంగం వైఖరిని వీడియో దృశ్యాలు వెలుగులోకి తెచ్చాయి. దీంతో అధికా రుల పరువు పోయినట్లయింది. పోలింగ్ నిర్వహణలో అడు గడుగునా సబంధిత అధికారులు పిన్నెల్లి లాంటి వ్యక్తులకు కొమ్ము కాశారన్న విమర్శలకు బలం చేకూరింది.

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంకా తాను నిజాయితీ పరుడనని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నానని బుకాయిస్తున్నాడు. ఓ మీడియాలో మాట్లాడుతూ ఇదే ప్రయత్నం చేశారు. 14న పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తన సోదరుడు వెంకట్రామిరెడ్డిలను హౌస్ అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంటిలో ఉండాల్సి పిన్నెల్లి బ్రదర్స్ లేరు. ఇంటిలో ఉండాల్సి వ్యక్తులు బయటకు వెళ్లడాన్ని ఏం అనాలి. దీనిని పారిపోవడమే అంటారు.

అడుగడుగునా వైఫల్యం

అడుగడుగునా ఎన్నికల యంత్రాగం.. పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. పోలింగ్ రోజున వెబ్ కాస్టింగ్ కోసం పోలీంగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి క్షణం పోలింగ్ బూత్‌లలో జరిగే సంఘటనలను రికార్డు చేస్తారు. ఈవీఎంలు ధ్వంసం చేస్తున్న దృశాలు రికార్డు అవుతున్న తరుణంలో లైవ్‌లో కూడా పరిశీలిస్తారు. అప్పుడే విధ్వంసాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసి ఈసీకి నివేదించాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా అమలు కాలేదు. ఈవీఎంలను ధ్వంసం చేశాక వాటిని సరిచేసేందుకు పోలింగ్ బూత్‌లకు సబంధిత సాంకేతిక సిబ్బంది, సబంధిత అధికారులు బూత్‌లను సందర్శించారు. ఈ సందర్భంలో ఏ బూత్‌లో ఎవరు ఈవీఎంల ధ్వంసంకు పాల్పడారు అన్న సమాచారాన్ని సేకరించారు. ఈ మేరకు పోలీసులకు పిర్యాదు చేయకుండా మిన్నకుండటంలో ఆంతర్యం ఏమిటి?. అరాచకాల గురించి ఫిర్యాదులో విషయం నమోదు చేశారా లేదా? సీసీ ఫుటేజ్ చూసే వరకు విషయం అంత గోప్యంగా ఎందుకు ఉంచారు? పోలింగ్ అధికారులు ఎవరికి కొమ్ము కాశారు? సిట్ బృందం జరిపిన పరిశీలనలో ఈ విషయాన్ని విచారణ నివేదికలో నమోదు చేశారా? వీటికి అధికారులు నివృతి చేస్తారో లేదో చూడాలి.



మాచర్లలో అలర్ట్

- ఎమ్మెల్యే అరెస్ట్ అయ్యారంటూ వదంతులు..

మాచర్ల రూరల్: ఈవీఎం ధ్వంసం కేసులో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ అయ్యారంటూ సోషల్ మీడియాలో వదంతులు దావానంలా వ్యాపించాయి. దీంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా పట్టణంలో దుకాణాలను మూసివేయించారు. దీంతో ఒక్కసారిగా పట్టణమంతా నిర్మానుష్యంగా మారింది. అల్లర్లు జరుగుతాయని పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కాగా పట్టణంలో 144 సెక్షన్ కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు.



మాచర్లలో దుకాణాలు మూయిస్తున్న పోలీసులు

పారదర్శకంగా ఓట్లలెక్కింపు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మే 22: ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పగడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఈసీ సూచించిన మార్గదర్శకాలను విస్మరించరాదన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు మరో రెండు కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14టేబుల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లో ఎట్టి పరిస్థితులలో అనుమతించరాదని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ వస్తువుల సైతం లోపలికి అనుమతించరాదన్నారు. నాలుగు రోజులు ముందుగా అన్ని ఏర్పాట్లు చేయాలని వారికి మార్గనిర్దేశం చేశారు. ఓట్లలెక్కింపు ప్రక్రియకు సంబంధించిన విధినిర్వహణలో పొరపాట్లు జరగకుండా అధికారులు నిఘా ఉంచాలన్నారు. లెక్కింపు కేంద్రంలో గొడవలు జరిగితే కఠినచర్యలు ఉంటాయని, కేసులు నమోదు చేస్తామనే విషయాన్ని అభ్యర్థులకు తెలపాలన్నారు. ఈనెల 28వ తేదిన ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. 30వ తేదీన ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణలు ఉంటాయన్నారు. 3వ తేదిన రెండోవ దశ శిక్షణ ఇవ్వాలన్నారు. నిష్ణాతులైన మాస్టర్ ట్రైనర్‌ల ద్వారా సిబ్బందికి సమర్థంగా శిక్షణలు నిర్వహించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్‌ల సమక్షంలో పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని ఆయన పలు సూచనలు చేశారు. ఓట్లలెక్కింపు ప్రక్రియకు అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవాలని ఆర్‌వోలను జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఆదేశించారు. ఈసీఐ మార్గదర్శకాలు, నిబంధనలపై పిపిటి ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ శ్రీధర్

ప్రాణం తీసిన గుంతలు

- బైకు పైనుంచి పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి
- యద్దనపూడి పర్చూరు రోడ్డులో ఘటన

యద్దనపూడి(మార్టూరు) మే 22: తారు రోడ్లు పల్లెల్లో ఉన్న డొంక రోడ్లు కన్నా దారుణంగా తయారయ్యాయి. గుంతలు పడి రెండేళ్లయినా పట్టించుకోని ప్రభుత్వ వైఖరికి, అధికారుల నిర్లక్ష్యానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిండు ప్రాణం బలైంది. ఈ ఘటన బుధవారం ఉదయం పర్చూరు వెళ్లే రోడ్డులో యద్దనపూడి గ్రామ శివార్లో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మండలంలోని పోలూరు ఎస్సీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తాళ్లూరి వినోద్ కుమార్ (37) మృతి చెందారు. అతను ఉమ్మడి ప్రకాశం దర్శి నియోజకవర్గం కురిచేడు మండలం అలవలపాడు గ్రామంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమార్‌కు భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదం జరిగిందిలా...

పోలూరు గ్రామానికి చెందిన వినోద్ కుమార్ ఉద్యోగరీత్యా పెద దర్శిలో నివాసం ఉంటున్నారు. అతను ఎన్నికలు నిమిత్తం పోలూరు గ్రామానికి ఓటు వేయడానికి తన ఇద్దరు కుమారులతో వచ్చారు. అనంతరం సెలవులు కావడంతో అడపాదడపా పెద దర్శి వెళ్లి వస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం పెద దర్శి నుంచి ద్విచక్రవాహనంపై పోలూరు గ్రామానికి వస్తున్నారు. వినోద్ కుమార్ గమనించలేదో ఏమోగానీ యద్దనపూడి గ్రామ పొలిమేర దాటిన తర్వాత పర్చూరు రోడ్డులో గుంతలలో అదుపు చేయలేక బైక్‌తో సహా రోడ్డుపై పడి పోయాడు. దాంతో వెంటనే అతని తల వెనుక భాగాన బలమైన దెబ్బ తగలడంతో విపరీతంగా రక్తస్రావం అయింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ విషయాన్ని అటుగా వెళ్తున్న కొంతమంది ద్విచక్రవాహనదారులు గమనించి పర్చూరు 108కి సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందడంతో ఎస్ఐ జీవీఎస్ చౌదరి సిబ్బందితో వచ్చారు. అయితే అప్పటికే అతను చనిపోవడంతో మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వినోద్ సోదరుడు సామ్యేలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టు మార్టమ్ చేయించగా సాయంత్రం బంధువులు మృతదేహాన్ని పోలూరు గ్రామానికి తీసుకు వెళ్లారు.



వినోద్ కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ఘటనపై స్పందించిన ఎస్ఐ

రోడ్లపై భారీగా గుంతలు ఉండడంతో ఉపాధ్యాయుడు మృతి చెందడం, కుటుంబ యజమానికి కోల్పోవడంపై ఎస్ఐ జీవీఎస్ చౌదరి వెంటనే స్పందించారు. మరోసారి ఈ రోడ్డుపై ఘటన జరుగకుండా ఉండేలా మార్టూరు మండలంలోని కోలలపూడి, వలపర్ల గ్రావెల్ క్వారీల నుంచి టిప్పర్లతో గ్రావెల్‌ను తెప్పించి గుంతలను పూడ్చివేయించారు. కిలో మీటర్‌కు పైగా గుంతల్లో మట్టిని పోసి చదును చేయించారు.

వైసీపీ అరాచక శక్తులను అరెస్టు చేయాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, మే 22 : సార్వత్రిక ఎన్నికల్లో దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడిన వైసీపీ అరాచక శక్తులను తక్షణమే అరెస్టుచేసి శిక్షించాలని టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసంచేసిన తీరు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనల ఉల్లంఘనలకు పరాకాష్ఠ అని అన్నారు. అతని నియంతృత్వ చర్యలను అడ్డుకున్న టీడీపీ ఏజెంట్లు, కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారన్నారు. పోలింగ్ రోజు, మర్నాడు నియోజవకవర్గంలోని పలుచోట్ల దాడులుచేసి, వాహనాలు దహనం చేశార న్నారు. పిన్నెల్లి బ్రదర్స్‌ని ఎన్నికలలో పోటీకి అనర్హులుగా ప్రకటించడంతో పాటు కౌంటింగ్ ప్రక్రియ నుంచి తొలగించాలన్నారు. గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి రౌడీలతో హల్‌చల్‌చేసి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేకంగా గొడవలకు పాల్పడ్డాడన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈసీ ఆదేశాలు దిక్కరించారని, పోలీసు గృహ నిర్బంధం నుంచి తప్పించుకుని కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబుపై దాడికి పాల్పడ్డాడన్నారు. ఇవి ఆరోపణలు కాదని, వీడియో, ఇతర సాక్ష్యాలున్నాయని, వైసీపీ అభ్యర్థులను అరెస్టు చేసి శిక్షించాలని, అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే పిన్నెల్లిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా



కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మే 22 : పోలింగ్ బూతులోకి తన అనుచరులతో వెళ్లి, ఈవీఎంను ధ్వంసం చేయటమే కాకుండా అడ్డువచ్చిన వారిపై అత్యంత కిరాతకంగా దాడిచేసిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు పన్నిన కుట్రలకు పోలింగ్ రోజు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి ప్రవర్తన అద్దం పడుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో ఎక్కడా జరగకుండా సంబందిత అధికారులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకో వాల్సిన అవసరం ఉందన్నారు. ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీఆర్కేపై శాశ్వత అనర్హత వేటు వేయాలి

సత్తెనపల్లి, మే 22 : ఈవీఎంను ధ్వంసంచేసిన వైసీపీ మాచర్ల అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా అనర్హత వేటు వేయాలని జై భీమ్ భారత్ పార్టీ జొన్నలగడ్డ విజయకుమార్ ఎన్నికల సంఘాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అయిన అభ్యర్థి తన అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి చొరపబడి, ఈవీఎం ధ్వంసం చేయటం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేన న్నారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎన్నికల్లో పాల్గొనకుండా ఆయనపై అనర్హత వేటు వేయాలని జొన్నలగడ్డ విజయకుమార్ ఎన్నికల సంఘాన్ని కోరారు.

ఈవీఎం ధ్వంసం సిగ్గుచేటు..

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మే22: నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి ఈవీఎంను ధ్వంసం చేయటం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈవీఎంను ధ్వంసం చేసిన మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణ రెడ్డిపై ఎన్నికల కమీషన్ కఠిన చర్యలు తీసుకోవాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడులు జరిగిన ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్‌వ్యవస్థ, ఎన్నికల సిబ్బంది ఏమైపోయారని ప్రశ్నించారు. డీజీపీ పోస్టుమ్యాన్ డ్యూటీ చేస్తున్నారని మండిపడ్డారు. సీఎస్ బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తున్నారని, అందుకే ఈ దాడులు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల రోజున దాదాపు 7 పోలింగ్ బూతులలో పిన్నెల్లి అరాచకం సృష్టించారని ఆరోపించారు. పిన్నెల్లి సోదరులను తక్షణమే అదుపులోకి తీసుకోవాలన్నారు. అంతేగాక గత 20 ఏళ్లగా అక్రమంగా సంపాందించుకున్న పిన్నెల్లి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్నారు.

అధికారం అండతో పిన్నెల్లి బ్రదర్స్ దారుణాలు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 22 : రాష్ట్రంలో అధికార వైసీపీ అరాచకాలు, గూండారాజ్యానికి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అయన సోదరుడి అకృత్యాలు ఒక ఉదాహరణ మాత్రమేనని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. శాంతి భద్రతలపై క్షేత్ర స్థాయిలో పోలీసు, అధికార వ్యవస్థ మొత్తం వైసీపీకి పాదాక్రాంతమైన దుస్థితిపై టీడీపీ తరుపున ఫిర్యాదులు అందినప్పుడే ఎన్నికల సంఘం చర్యలు తీసుకొని ఉంటే పరిస్థితి ఇంత వరకు వచ్చేదా? అని ప్రశ్నించారు. బుధవారం తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో చొరబడి ఈవీఎంను ధ్వంసం చేసేంత ధైర్యం వారికి వచ్చిందంటే ఈసీ, పోలీసుల అలసత్వం కాదా? అని నిలదీశారు. పాలువాయిగేటు ఎన్నికల కేంద్రంలో ఈవీఎం ధ్వంసం కేసులో చర్యలు తీసుకోవడానికి ఇన్నిరోజులు ఎందుకు ఆలస్యమైందో చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. పల్నాడుజిల్లా వ్యాప్తంగా జరిగిన హింసకు, ఈవీఎం ధ్వంసానికి కారణమైన వ్యక్తిని హౌస్ అరెస్టు నుంచి తప్పించింది ఎవరు?, ఇన్ని రోజులుగా అతను ఎక్కడ దాక్కున్నాడు? స్థానిక పోలీసుల సహకారం లేకుండా పిన్నెల్లి సోదరులు పల్నాడు నుంచి పారిపోవడం సాధ్యమేనా? వంటి విషయాలన్నింటికీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, డీజీపీ సమాధానం చెప్పి తీరాలన్నారు. తమ మార్కు రౌడీయిజంతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికే మాయ నిమచ్చ తెచ్చిన పిన్నెల్లి సోదరులకు కఠిన శిక్షలు పడేలా చేయటంతో పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవిత కాలంలో నిషేదం విధించాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

వైసీపీ అరాచక పాలనకు త్వరలోనే ముగింపు

● పోలీసులు ఇకనైనా పద్ధతిగా మెలగాలి
● బాంబులు వేసిన వారిపై, వేయనివారిపై ఒకే కేసులా..
● తప్పు చేసిన అధికారులపై విచారణ తప్పదు..
● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు



యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 22: ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనకు త్వరలోనే ముగింపు రానున్నదని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 4న రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందన్నారు. రెంటచింతల మండలం పాలువాయి గేటులోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసంచేసిన మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల జగన్‌పాలనలో పోలీసువ్యవస్థ నిర్వీర్యమైందని, కొంత మంది అధికారులు నిజాయతీగా పనిచేసినా, మరికొందరి ప్రభుభక్తి పోలీసు శాఖకే మచ్చతెచ్చిందన్నారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాలలో వైసీపీ దాష్టీకాలకు పోలీసులు, అధికారులు ఎవరైతే వత్తాసు పలికారో ప్రభుత్వం మారిన అనంతరం వారందరిపై విచారణలు చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఎన్నికలకు ముందు, అనంతరం గురజాల నియోజకవర్గంలో కొంతమంది పోలీసులు వైసీపీకి తొత్తుగా మారి టీడీపీ శ్రేణులపై ఇష్టారాజ్యంగా తప్పుడు కేసులు పెడుతున్నారని యరపతినేని ఆరోపించారు. తంగెడ గ్రామంలో పోలింగ్ బూత్‌పై వైసీపీ గూండాలు బాంబులు విసిరితే టీడీపీ వారిపై హత్యాయత్నం కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా మాదినపాడు, కొత్తపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలను విచక్షణా రహితంగా కొట్టడం దేనికి సంకేతమో ఆ ఎస్ఐలు, సీఐలు సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల ఘర్షణలు, అక్రమాలపై సిట్ అధికారుల దర్యాప్తు పారదర్శకంగా సాగాలని, తప్పు చేసిన వారిపై, చేయని వారిపై ఒకేలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఈ ఎన్నికల్లో అడ్డగోలుగా, అరాచకంగా వ్యవహరించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్ రెడ్డిలు ఇంటికిపోవడం ఖాయమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇబ్బందిపడ్డ ప్రజలతో పాటు పార్టీ నేతలకు, కార్యకర్తలకు అండగా ఉంటానని యరపతినేని భరోసా నిచ్చారు. అదే సందర్భంలో ఈ ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలపై నోరు పారేసుకున్న, చేయిచేసుకున్నవారు తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచి

వేరుపడిన ఏసీ బోగీలు

● మరమ్మతులకు మూడు గంటలకు పైగా సమయం
● 4.30 గంటల ఆలస్యంగా నడిచిన రైలు
● తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): నిత్యం విశాఖపట్టణం - లింగంపల్లి మధ్యన గుంటూరు మీదగా ప్రయాణించే నెంబరు. 12805 జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. బుధవారం ఉదయం ఈ రైలు విశాఖపట్టణంలో బయలుదేరిన రెండు నిమిషాలకే ఏసీ బోగీల లింకులు ఊడిపోవడంతో సిబ్బంది గమనించి వెంటనే రైలుని నిలిపేశారు. సాంకేతిక లోపాన్ని సవరించి తిరిగి ఫిట్ ఇచ్చేసరికి 3 గంటలకు పైగా సమయం పట్టింది. ఈ కారణంగా మధ్యాహ్నం 1.10 గంటలకు గుంటూరు రైల్వేస్టేషన్‌కు రావాల్సిన రైలు సాయంత్రం 5.27కి వచ్చింది. అయితే ఎదురు వచ్చే రైళ్ల కోసం జన్మభూమిని పలు చోట్ల లూప్ లైన్‌లో పెట్టారు. ఈ కారణంగా రాత్రి 11 గంటల తర్వాత లింగంపల్లికి రైలు చేరుకొంటుందని ఎన్‌టీఈఎస్‌లో అప్‌డేట్ చేశారు. బుధవారం ఎండ తీవ్రంగా ఉండటంతో ఈ రైలులో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న వారు గంటల తరబడి ఆలస్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మూడు రోజుల పాటు

ఎల్‌సీ గేటు నెంబరు 304 మూసివేత

పేరేచర్ల-ఫిరంగిపురం రైల్వేస్టేషన్ల మధ్యనున్న లెవల్ క్రాసింగ్ గేటు నెంబరు. 304ని 3రోజుల పాటు మూసివేస్తున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. అత్యవసర మరమ్మతులు కారణంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 26వ తేదీ రాత్రి 8 గంటల వరకు గేటు మూసి ఉంటుందన్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ప్రత్యామ్నాయం చూసుకోవాలని డీఆర్ఎం ఎం.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో

డీఫార్మసీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య),మే 22: గుంటూరు గుజ్జనగుండ్ల సెంటరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డీఫార్మసీ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకకటనలో పేర్కొన్నారు. 2 సంవత్సరాల కాలపరిమితి గల ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పూర్తిచేసిన విద్యార్థినులు అర్హులని తెలిపారు. అదేవిధంగా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డు లేదా తత్సామాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెంది ఉండీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు ఉన్నవారికి స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందని తెలిపారు. విద్యార్థినులకు కళాశాలలోనే హాస్టల్ సౌకర్యం ఉందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు వారి పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, రూ.400 దరఖాస్తు ఫీజుతో గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం 93986 20953 నంబరుని సంప్రదించాలని పేర్కొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఉమ్మడి జిల్లా(గుంటూరు, పల్నాడు, బాపట్ల)లోని సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ కే.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోరే విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని, 5వ తరగతిలో ప్రవేశం కోసం 2023-24 సంవత్సరాల్లో 4వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. ఈనెల 24న 5వ తరగతిలో ప్రవేశం కోసం, 25న ఇంటర్‌లో ప్రవేశం కోసం అడవి తక్కెళ్ళపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

గుంటూరు నగరంలో యువకుడి దారుణ హత్య

గుంటూరు, మే 22 : గుంటూరు నగరంలోని అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజీవయ్య నగర్ మెయిన్ రోడ్డు వద్ద బుధవారం మధ్యాహ్నం కంచర్ల దేవానందం అలియాస్ దేవా (33) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఆర్థిక లావాదేవీల వ్యవహారంలోనే ఈహత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. దేవా స్నేహితులైన అదే ప్రాంతానికి చెందిన పల్లె రాజు, చిలక రాజు అనే ఇద్దరు కత్తులతో పొడిచి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఈ హత్యకు దేవా మేనమామ జ్యోతిరాజు పైన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సమాచారం అందుకున్న వెస్ట్ డీఎస్పీ మహేష్, అరండల్ పేట సీఐ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు..

గతంలో సంజీవయ్యనగర్ 1వ లైన్‌కి చెందిన దేవా కొంత కాలం వలంటీర్‌గా పని చేశాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. అనంతరం విశాఖపట్నం ఉంటున్న దేవా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొంతకాలం క్రితం నగరానికి వచ్చి నగరాలులో నివాసం ఉంటున్నాడు. దేవా రియల్‌ఎస్టేట్ వ్యాపారం లోకి దిగాడు. వ్యాపార లావాదేవీల్లో భాగంగా దేవాకు హౌసింగ్ బోర్డుకాలనీలో ఉంటూ, నల్లపాడులోని పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేసే తన మేనమామ జ్యోతి రాజుకు రూ.15 లక్షల వరకు బకాయిపడ్డాడు. ఆమొత్తం చెల్లించాలంటూ జ్యోతిరాజు కొంత కాలంగా దేవాపై ఒత్తిడి తెస్తున్నాడు. ఈ క్రమంలో జ్యోతి రాజు 15 రోజుల క్రితం దేవాను చంపుతానని బెదిరించాడు. జ్యోతిరాజు తనకు సొంత మేనమామ కావడంతో ఆయన హెచ్చరికలను దేవా తేలిగ్గా తీసుకున్నాడు. ఇదిలా ఉండగా రెండు రోజులుగా దేవా తన స్నేహితులైన సంజీవయ్య నగర్‌కు చెందిన పల్లె రాజు, చిలక రాజులతో కలిసి మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం దేవ తన కారులో వసంత రాయపురం మెయిన్ రోడ్డులోని బార్‌కు తన ఇద్దరు స్నేహితులు పల్లె రాజు, చిలక రాజులను తీసుకెళ్లాడు. అక్కడ ముగ్గురు కలసి మద్యం తాగారు. అనంతరం ఇంటికి వచ్చేందుకు బయలుదేరారు. మధ్యా హ్నం సుమారు 12: 45 గంటల సమయంలో కారు సంజీవయ్య నగర్ మెయిన్ రోడ్డు వద్దకు రాగానే కారులోవున్న ఇద్దరు స్నేహితులు కత్తులతో దేవాపై దాడి చేశారు. ఈ ఘటనతో తేరుకున్న దేవా తప్పించుకునేందుకు కారు దిగి పారిపోతుండగా వెంటపడి కత్తులతో పొడిచి హత్యచేసి పరారయ్యారు.

దేవా స్నేహితులే నిందితులు కావటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిందితులతో దేవాకు ప్రత్యక్షంగా ఏ వివాదాలు, గొడవలు లేవని కుటుంబసభ్యులు తెలిపారు. అయితే తనకు రావలసిన బకాయి విషయంలో మేనమామ జ్యోతిరాజు చంపుతానని దేవాను హెచ్చరించినట్లు హతుని సోదరుడు తెలిపాడు. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరు నిందితులతో పాటు పోలీసులు అనుమానిస్తున్న జ్యోతిరాజు పరారీలో ఉన్నాడు. దీంతో పోలీసులు అనుమానాలకు మరింత బలం చేకూరినట్లు అయింది. కాగా నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసు బృందాలు రంగంలో దిగి గాలింపు ప్రారంభించాయి.

రాజధాని రైతులకు వార్షిక కౌలు ఇవ్వటం లేదు

● 1618వ రోజుకు చేరిన రైతులు, మహిళల ఆందోళనలు

తుళ్లూరు, మే 22: రాష్ట్ర రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సిన వార్షిక కౌలు మూడేళ్ల నుంచి అందటం లేదని ఆయా ప్రాంతాల రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 16 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులు మాట్లాడుతూ.. అక్కచెల్లమ్మలకు అండగా ఉంటానని జగన్‌రెడ్డి మోసపు మాటలు చెప్పాడన్నారు. జీవనాధారమైన భూములిస్తే అభివృద్ధి చేయక పోగా చట్టబద్ధంగా ఇవ్వాల్సిన కౌలును ఇవ్వటం లేదన్నారు. దళిత అసైన్డ్ రైతులకు ప్రత్యేక ప్యాకేజీ అని జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. అమరావతి కల్పవృక్షాన్ని జగన్‌రెడ్డి కూల్చి వేయటంతో రాష్ట్ర ప్రజలు ఈ ఎన్నికలలో వైసీపీని తిరస్కరించారన్నారు. అది ఓటింగ్ శాతం చూస్తే కనబడుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.



తుళ్లూరులో నినాదాలు చేస్తున్న రాజధాని ప్రాంత రైతులు, మహిళలు

ఎన్నికల హింసాత్మక ఘటనల్లో

24 మంది నిందితులకు రిమాండ్

● పల్నాడు జిల్లాను జల్లెడ పడుతున్న పోలీసులు

నరసరావుపేట లీగల్, మే 22 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి ఇప్పటి వరకు సబ్ డివిజన్ పరిధిలో 24 మంది నిందితులను ఆయా పోలీసు స్టేషన్‌ల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటివద్ద చోటుచేసుకున్న ఘటనలో 10 మంది నిందితులను అరెస్టు చేసి బుధవారం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్ ఎదుట ప్రవేశ పెట్టగా రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రిమాండ్‌కు తరలించిన వారిలో రామకోటేశ్వరరావు, శాఖమూరి నవీన్, ఆవుల మణికంఠ, షేక్ నాగుల్ మీర, మహబూబ్ బాషా, బాదర్ ఖాజా, ముత్తిరెడ్డి శంకర్, ఖాజావలి, ఇంటూరి వెంకట మహేష్, తెనాలి తిరుపతిలు ఉన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో 39 మందిని నిందితులుగా గుర్తించారు. కాగా రిమాండ్ సమయంలో కోర్టులో ఆసక్తికరమైన వాదనలు సాగాయి. నిందితుల తరుపున హైకోర్టు న్యాయవాదులు రంగంలోకి దిగి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రిమాండ్ చెల్లదని, హత్యాయత్నం కేసు తప్పక మిగతా సెక్షన్‌లన్నీ బెయిల్‌బుల్ సెక్షన్‌లని, హత్యాయత్నం నేరంకు తగిన గ్రౌండ్స్ లేవని, రిమాండ్ తిరస్కరించాలని కోరారు. కాగా దీనికి ప్రతిగా ఏపీపీ లక్ష్మీరామ్‌నాయక్ వాదిస్తూ ఘటనకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, హింసాత్మక ఘటనలకు ఉపయోగించిన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, మరి కొందరు నిందితులు అరెస్టు కావాల్సి ఉందని, నిందితులకు రిమాండ్ విధించాలని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి ఆశీర్వాదంపాల్ రిమాండ్‌ను అంగీకరిస్తూ జూన్ 4వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా మరో కేసులో మొదటి పట్టణ పోలీసులు బీజేపీ నేత రంగిశెట్టి రామకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో పమిడిపాడు ఘటనకు సంబందించి ఐదుగురు నిందితులకు రిమాండ్ విధించారు. రొంపిచర్ల పోలీసు స్టేషన్‌కు సంబంధించి సంతగుడిపాడు గ్రామంలో ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనల్లో ఇరుపక్షాలకు చెందిన 8 మంది నిందితులకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీకి చెందిన వారినే అరెస్టు చేస్తున్నారు..

ఎన్నికల ఘర్షణల నేపథ్యంలో ఇప్పటి వరకు 24 మందిని పోలీసులు అరెస్టు చేయగా వారిలో ఒకరు కూడా అధికార పార్టీకి చెందిన వారు లేరని టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఆరోపించారు. అంతేగాక పట్టణ పరిధిలోని కొన్ని పోలీసుస్టేషన్‌ల అధికారులు సరైన సమాచారం ఇవ్వటంలేదని, అధికార పక్షానికి చెందిన వారికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారని, ముఖ్యంగా రూరల్ పరిధిలోని ఓ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఇప్పటికీ అధికార పక్షానికి పూర్తిగా సహకరిస్తున్నారని, సదరు అధికారి పై ఉన్నతాధికారులు దృష్టి సారించి అన్ని పక్షాలకు సమన్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిట్ టీమ్ వచ్చిన సందర్భంలో ఫిర్యాదు ఇవ్వటానికి వెళ్ళిన వ్యక్తుల నుంచి సదరు అధికారి ఫిర్యాదు తీసుకోక పోగా వేరే కేసుల్లో నిందితులుగా ఉన్నారని, వారిని 3 రోజులు అక్రమంగా నిర్బందించారని, ఈ విషయాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాలని లీగల్ సెల్ న్యాయవాదులు డిమాండ్ చేశారు.

బీసీలతో కాంగ్రెస్, బీజేపీల దొంగాట

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

తెనాలి అర్బన్, మే 22: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఓబీసీల న్యాయమైన డిమాండ్లపై దొంగాట ఆడుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విమర్శించారు. బుధవారం తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జాతీయస్థాయిలో సమగ్ర కులగణన చేయిస్తామని, సుప్రీం కోర్టు ఇచ్చిన రిజర్వేషన్లను 50 శాతం మించకూడదనే పరిమితిని తొలగిస్తామని కాంగ్రెస్ పార్టీ, తెలంగాణాలో బీజేపీ గెలిస్తే బీసీని సీఎంని చేస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్న మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఇస్తున్న హామీలు మ్యానిఫెస్టోలో ఎందుకు చేర్చలేకపోయారో అర్థం కావడం లేదన్నారు. బీసీల సంక్షేమానికి ప్రతి బంధకమైన క్రిమిలేయర్ విధానం ఎత్తివేయడం,కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయడం వంటి అంశాలు మేనిఫెస్టోలో ఎందుకు పొందుపర్చలేదని కేసన ప్రశ్నించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం

● ఎస్పీ వకుల్ జిందాల్

● సమస్యాత్మక గ్రామాలలో కార్డెన్ అండ్ సెర్చ్



బాపట్ల మండలంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ యు.శ్రీనివాసులు, సిబ్బంది

బాపట్ల,మే 22 : ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణే లక్ష్యంగా బాపట్ల మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో బుధవారం కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ యు.శ్రీనివాసులు సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు సంయమనంతో వ్యవహరించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజున, తదనంతరం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పడమర పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిఎస్పీ మురళీకృష్ణ, సీఐలు యు.శ్రీనివాసులు, బి.హజరత్‌బాబు, పోలీసు సిబ్బంది, ఏపీఎస్పీ బలగాలు పాల్గొన్నాయి. గ్రామంలోని పాతనేరస్తులు, రౌడీషీటర్లు, ఇతర ప్రాంతాలు నుంచి వచ్చి నివాసం ఉంటున్న వారు హింసాత్మక ఘటనలకు పాల్పడే అవకాశాలు ఉన్నవారు గురించి ఆరా తీశారు. ఆయా ప్రాంతాలలో పెట్రోల్, డీజీల్, కర్రలు, రాళ్ళు వంటివి, ఇతరులకు హాని కల్పించటానికి ఇతర ఆయుధాలు గురించి విస్తృతంగా తనిఖీ చేశారు.

తెలుగు పాటల వెలుగు వేటూరి

● సాహితిభారతి అధ్యక్షుడు రావూరి

బాపట్ల, మే 22 : తెలుగు సినిమా పాటకు కావ్య గౌరవాన్ని ప్రసాదించిన కవి వేటూరి సుందర రామమూర్తి అని, శ్రీశ్రీ తర్వాత తెలుగు సినిమా పాటకు కేంద్ర స్థాయి గుర్తింపు తీసుకొచ్చిన కవి, తెలుగు పాటల వెలుగు వేటూరి సుందరరామమూర్తి అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. బుధవారం వేటూరి సుందరరామమూర్తి 14 వర్ధంతి సభలో సాహితీ భారతి కోశాధికారి ఆదంషఫి, మాట్లాడుతూ తెలుగు సినీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని, 1800 సినిమాలకు 5000 వేలకు పైగా పాటలు రచించారని అన్నారు. అనంతరం సాహితిభారతి ఉపాధ్యక్షుడు ఎం.మాల్యాద్రిరావు, మున్నం మస్తాన్‌రెడ్డి, కీర్తి వెంకటయ్య, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావులు వేటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు.

శ్రీ కాళికమ్మకి సాగరజలం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం



శ్రీకాళికమ్మతల్లి ఆలయంలో జలబిందెలతో మహిళా భక్తులు

కర్లపాలెం, మే 22 : మండల కేంద్రమైన కర్లపాలెం, ఏట్రవారిపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ భద్ర కాళీకమ్మ వీరభద్రస్వామి ఆలయంలో 14వ వార్షిక వేడుకలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారికి కొలుపులు కొలుస్తూ ఏట్రవారిపాలెం గ్రామ దేవత శ్రీ రెడంకమ్మతల్లి ఆలయం నుంచి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వరకు పసుపుబండ్లతో ఊరేగింపుగా వచ్చి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా అమ్మవారికి సాగరజలం, సుగంధ ద్రవ్యాలతో ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో విశేషంగా అలంకరించారు. ఈ వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాలను కుంచాల సాంబిరెడ్డి, కొక్కిలిగడ్డ రామరాజు, కట్టా సుజాత, దుర్గాప్రసాద్, నాగవర్ధనరెడ్డి, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో ధార్మిక చైతన్యం తీసుకురావాలి

● ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రోగ్రామ్ అధికారి అమ్మడు

కర్లపాలెం,మే 22 : తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందుధర్మప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్లపాలెం శ్రీకోదండరామాలయంలో మంగళవారం నుండి శుక్రవారం వరకు నాలుగు రోజులపాటు ధార్మిక కార్యక్రమాలను అమ్మడు భక్తుల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. గ్రామాలతో ధార్మికచైతన్యం కలగజేయటం కోసం ప్రజలలో భక్తిభావాలను నెలకొల్పటం కోసం తిరుమల-తిరుపతి దేవస్థానం ఈ విధంగా ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రోగ్రామ్ అధికారి అమ్మడు తెలిపారు. కర్లపాలెం పంచాయతీ తెలగలపాలెంలో అమ్మడు ఆధ్వర్యంలో భజనలు, ఉపన్యాసాలు, లక్ష్మీఅమ్మవారి కుంకుమపూజలను ఏర్పాటు చేశారు. ఉపన్యాసకురాలు అనంతలక్ష్మి ధార్మిక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో సోమన సత్యవతి, ఆకుల లక్ష్మి, తిరుమలశెట్టి హనుమాయమ్మ, ఆకుల వెంకాయమ్మ, సోమన యశోద, ఆకుల వెంకటేశ్వరమ్మ, ఉప్పె అంజమ్మ, ఉప్పె రాజ్యలక్ష్మి, ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, అక్కల సుబ్బారెడ్డి, స్థానిక భజన సమాజం భక్తులు పాల్గొన్నారు.

జగన్మోహిని అవతారంలో భావదేవుడు



జగన్మోహిని ఉత్సవంలో భావదేవుడు

బాపట్లమే 22 : పట్టణంలో చారిత్రక ప్రసిద్దిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణ స్వామి 1431వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారు జగన్మోహిని అవతారంలో కొలువుతీరారు. అర్చకస్వాములు శ్రీనివాసుల విఖనసమూర్తి, నల్లూరి విజయసారధి, నల్లూరి పాంచజన్యం, బృందావనం గోపిచంద్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తజనం స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారిని జగన్మోహిని అవతారంలో నగరోత్సవం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు దేశిరాజు వెంకటరమణబాబు, ఈవో డి.వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సచివాలయ సిబ్బంది ఇబ్బందిపెడుతున్నారంటూ ఆందోళన



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

బాపట్ల,మే 22 : పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన జగనన్నకాలనీ లబ్ధిదారురాలి నివేశన స్థలం పట్టా తీసుకొని సచివాలయ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారంటూ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. లబ్ధిదారురాలు గరిక అలివేలుకు మూలపాలెం లేఅవుట్‌లో ప్లాట్ నెం.600 మంజూరు చేసి పట్టా ఇచ్చారు. సదరు మహిళ భర్త గరిక నాగయ్య రిక్షా తొక్కుకొని జీవనం సాగిస్తుంటారు. వీరి ఆర్థిక పరిస్థితి సరిగ్గాలేక పోవటంతో సచివాలయ సిబ్బంది ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ఓ కాంట్రాక్టర్ దగ్గర ఒప్పందం కుదిర్చారు. దీనికి గాను రూ.21 వేల నగదు లబ్ధిదారురాలు చెల్లించింది. ఆతర్వాత బేస్‌మెంట్ నిర్మించి బ్యాంక్‌ఖాతాలలో పడిన రూ.75 వేలు కూడా సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఆ సమయంలో ఇంటి పట్టా కూడా తీసుకొని వారి వద్ద పెట్టుకున్నారు. ప్రస్తుతం నాగయ్యకు కంటిఆపరేషన్ చేయించటంతో డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. బేస్‌మెంట్ వరకు నిర్మించిన ఇంటిని తర్వాత తామే నిర్మించుకుంటామని చెప్పి పట్టా తిరిగి ఇవ్వాలని కోరారు. దీనికి నిరాకరించిన సచివాలయ సిబ్బంది ఇంకా రూ.9 వేలు చెల్లిస్తే పట్టా ఇస్తామని ఆరునెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు.. దీంతో బాధిత మహిళ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేశారు. సచివాలయ సిబ్బంది ఇవ్వటం కుదరదని చెప్పటంతో కమిషనర్ బి.శ్రీకాంత్‌ను కలిసి సమస్యను వివరించారు. దీంతో ఆయన పట్టా ఇచ్చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. దీంతో బాధితులు శాంతించారు.

బాపట్ల ఇలవేల్పు శ్రీభావన్నారాయణస్వామి



శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయం

బాపట్ల, మే 22 : ఘనమైన చరిత్రకు సజీవసాక్ష్యం.... చారిత్రక ప్రసిద్ధిగాంచిన బాపట్ల పట్టణంలోని శ్రీమత్ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి ఆలయం.. బాపట్లలోని భావన్నారాయణస్వామి దేవాలయం భారతదేశంలోని ప్రాచీన వైష్ణవ క్షేత్రాలలో ఒకటి. ఇది సుమారు 1431 సంవత్సరాలకు పూర్వం చోళులచే నిర్మితమైనది. శైవమునకు పంచారామ క్షేత్రాలు ఉన్నట్లుగానే వైష్ణవంనకు కూడా పంచభావన్నారాయణ క్షేత్రాలున్నాయి. ఇక్కడ నెలకొని ఉన్న భావన్నారాయణస్వామి పేరిట ఈ ఊరికి భావపురి అనే పేరు వచ్చింది. కాలాంతరాన ఆ పేరు రూపాంతరం చెంది భావపట్లగా, బాపట్లగా మారింది. ఈ దేవాలయంలో భావన్నారాయణుడు ఇతర పరివార దేవతలైన శాంతకేశవస్వామి, జ్వాల న ర సిం హ స్వామి, శ్రీరాముడు, అమ్మ వార్లు, ఆళ్వారులతో కొలువై ఉండి భక్తుల ఇష్టదైవంగా వెలుగొందుతున్నారు. ముఖ్యంగా కేశవస్వామి ఎంతో సుందరంగా ఉండి భక్తులకు కనువిందు చేస్తారు. శ్రీకృష్ణదేవరాయలు ఈ దేవస్థానాన్ని సందర్శించినట్లుగా ఆధారాలు ఉన్నాయి. ఆలయంలోని ప్రతి రాతిపైన స్థలపురాణం, ఆలయచరిత్ర ఇత్యాదివిషయాలు రాయబడి ఉన్నాయి. ప్రతిఏట వేసవికాలంలో వైశాఖమాసంలో వైభవంగా జరిగే తిరునాళ్ళ బ్రహ్మోత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. 2011 అక్టోబరు 23న ఆలయ గాలిగోపురం కుప్పకూలింది. ఆతర్వాత దీని నిర్మాణం చేయటంలో జాప్యం జరిగింది. 2020లో ఎమ్మెల్యే కోన రఘుపతి హయంలో గాలిగోపురం నూతనంగా, అందంగా రూపుదిద్దుకొని ఆలయ సంప్రోక్షణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ రథశాల కూడా నిర్మించారు. ఆలయంలోపల చలికాలంలో వెచ్చగాను, ఎండకాలంలో చల్లగాను ఉండటం గొప్ప అనుభూతికి లోనవుతాం. గతంలో ఆలయంలోనే శివాలయం కూడా అంతర్భాగంగా ఉండేది. ఈ ఆలయానికి రెండు ధ్వజస్తంభాలు, ఆలయ స్తంభాలు గజపాద (ఏనుగకాలు) ఆకా రంలో స్తంభాలు ఉండటం విశేషం. ఆలయంలో గర్భగుడి వెనుక పైకప్పుపై మత్స్యం (చేపఆకారం) కనిపిస్తుంది. దీనిని తాకితే శుభమని భక్తులు భావిస్తారు.

నేడు రథోత్సవం సందర్భంగా..

నేడు రథోత్సవం...

శ్రీ భావదేవుని 1431వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం తెల్లవారుజామున శ్రీవారి కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. ఉదయం గరుడోత్సవం, సాయంత్రం స్వామివారి రథోత్సవం (బావయ్య పౌర్ణమి) నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లుచేశారు. రథోత్సవం రోజు జరిగే తిరునాళ్ళ మహోత్సవానికి పరిసరప్రాంత ప్రజలతోపాటు దూరప్రాంతాలు నుంచి కూడా భక్తజనం విశేష సంఖ్యలో తరలి వస్తారు. కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో శ్రీభావపురి అయ్యప్ప సేవాసంఘం ద్వారా ఉదయం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ అంగరంగవైభవంగా వేడుకలను నిర్వహిస్తూ ఉన్నారు.



శ్రీభావన్నారాయణస్వామి



ఉత్సవానికి సిద్ధం చేస్తున్న భావదేవుని రథం

డ్రైనేజి జేఈ భరద్వాజపై చర్యలు తీసుకోవాలి

● బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

బాపట్ల, మే 22 : బాపట్ల మండలం అడవిగ్రామపంచాయతీ వెంకటరంగాపురం-కప్పలవారిపాలెం మధ్య నల్లమడ డ్రైన్ కట్టలు తవ్వి ఇసుకను తరలించిన వారితోపాటు దీనికి సహకరించిన డ్రైనేజి జేఈ భరద్వాజపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గుదే రాజారావు బుధవారం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికే అప్పికట్ల రోడ్డులో, కొండుభొట్లపాలెంలో నల్లమడ కట్టలు తవ్వారని, ప్రస్తుతం వెంకటరంగాపురం దగ్గర కట్టలు తవ్వుతున్నా పట్టించుకోవటంలేదని ఆరోపించారు. డ్రైనేజి కట్టలు పరిరక్షించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులే విధుల పట్ల ఈ విధంగా నిర్లక్ష్యం వహించటం దారుణమని, సదరు జేఈపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే 200 ట్రాక్టర్ల ఇసుకను తవ్వి తరలించారని పేర్కొన్నారు.

కూలీలకు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పని కల్పన

పిట్టలవానిపాలెం, మే 22 : వ్యవసాయ కూలీలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పని కల్పిస్తున్నట్లు పిట్టలవానిపాలెం మండల ఏపీవో ఎం.సుభాషిణి అన్నారు. మండల పరిధిలోని 14 గ్రామపంచాయతీలలోని పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, కొత్తపాలెం, జిఎన్‌పాలెం, అల్లూరు, అలకాపురం, పోతనకట్టవారిపాలెం, భవనవారిపాలెం, కోమలి, సంగుపాలెం, కోడూరు, చందోలు గ్రామాలలోని కూలీలకు పంట పొలాలలో పంటకాల్వల పనులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. ఖాజీపాలెం గ్రామ పంచాయతీలో పంట పొలాలలో కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల ఏర్పాట్ల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎండకాలం దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.300 చొప్పున కూలీ వేతనంగా, కూలీ చేసిన పనిని బట్టి వారికి నగదు అందజేయటం జరుగుతుందని, గతంలో రూ.270 ఉండగా ప్రస్తుతం రూ.300కు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

లోవోల్టేజిని అధిగమిస్తాం : ఏఈ

కర్లపాలెం, మే 22 : కర్లపాలెంలోని 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రంలో 8 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయటం వల్ల కర్లపాలెం మండలంలో అన్ని గ్రామాలలో లోవోల్టేజి సమస్యను అధిగమించవచ్చునని, విద్యుత్ సక్రమంగా సరఫరా జరుగుతుందని మండల విద్యుత్‌శాఖాధికారి మల్లెల కుమార్ తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రంలో బుధవారం 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలుగ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. సాయంత్రం 6.30 ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల వార్షిక మహోత్సవాలు

భట్టిప్రోలు, మే 22: మండలంలోని వెల్లటూరులో కొలువైయు న్న కట్లమ్మతల్లి 26వ వార్షిక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఉదయం అమ్మవారికి నిత్యపూజ, నదీస్నానం, సాయంత్రం గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, కనకతప్పెట్లు, నృత్య గీతాలతో అమ్మవారి వార్షిక ఉత్సవాలను ఘ నంగా జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉత్సవాలను కట్లమ్మతల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అదేవి ధంగా స్థానిక హిందూ శ్మశాన వాటికలో ఉన్న గుండిపార్వతి అమ్మవారి వార్షిక ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారి పసుపు, కుంకుమ బండ్ల ఊరేగింపు పవిత్ర నదీ స్నానం గ్రామోత్సవం గావించారు. గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం నిత్య పూజ, చద్ది నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పచ్చిరొట్ట ద్వారా భూసారాన్ని పెంచుకోవాలి : ఏవో

కొల్లూరు, మే 22 : రైతులు పచ్చి రొట్ట ఎరువుల ద్వారా భూ సారాన్ని పెంచుకోవాలని బాపట్ల ఏవో విజయబాబు అన్నారు. బుధవారం కొల్లూరు వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారులు పచ్చి రొట్ట ఎరువులు, మట్టినమూనాల సేకరణ, సేంద్రి య ఎరువుల వల్ల ఉపయోగాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల ను ఎక్కువగా వాడటం వల్ల భూసారం రాను, రాను తగ్గిపోతుందన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో పాటు పచ్చి రొట్ట విత్తనాలను భూమిలో కలియ దున్నటంతో భూసారాన్ని పెంచుకోవటానికి అవకాశం ఉందన్నారు. 50శాతం రాయితీపై జనుము, పిల్లి పెసర పచ్చి రొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందు బాటులో ఉన్నట్లు తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి సింధూర లేపన పూజ



వీరాంజనేయ స్వామికి సింధూర లేపన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

వేమూరు, మే 22: మండలంలోని జంపని గ్రామంలో ఉన్న వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. తొలి రోజున విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవాచన స్వామివారికి పంచామృత అభిషేకం జరిపి మూలవిరాట్‌కు సింధూర లేపన పూజ జరిపారు. పండిత దీవి లక్ష్మీనరసింహాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించిన క్రతువులో అర్చకులు పంచ సూక్తాలు పారాయణ చేశారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణ జరిపి భజన కీర్తనలు ఆలపించారు. పల్లకి ఉత్సవం జరిపారు. చల్లగుండ్ల చిన్న బంగారుబాబు, గుంటూరు వెంకట్రావు, టి.గంగాధరరావు, గాదంశెట్టి వెంకట బదరీ సూర్యనారాయణ, చల్లగుండ్ల నారాయణరావు దంపతులు ఉత్సవ దాతలుగా వ్యవహరించారు.



ఐలవరం గ్రామంలో విద్యుత్ దీపకాంతుల్లో వెలుగొందుతున్న జంట రథాలు

కనుల పండువగా ఐలవరం జంట రథోత్సవాలు

భట్టిప్రోలు, మే 22 : మండలంలోని ఐలవరంలో కొలువైయు న్న భద్రావతి సమేత భావనారుషి స్వామి, మార్కండేయ ఈశ్వర భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. బుధవారం రాత్రి జరిగిన జంట రథోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రథాలను లాగుతూ జై మార్కండేయ జైజై మార్కండేయ అంటూ నామస్మరణ చేశారు. కల్యాణమూర్తులైన స్వామివార్లను రథాలపై ఉంచి పద్మశాలీయ సంఘీయుల ఆధ్వర్యంలో జంట రథాలను లాగుతూ భక్తులు భక్తి పారవశ్యం పొందారు. ప్రతి ఏటా అత్యంత వైభవంగా జరిగే జంట రథోత్సవాన్ని తిలకించేందుకు సమీప మండలాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. తిరునాళ్లను పురస్కరించుకుని రథాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు పద్మశాలీయ సంఘీయులు. బాణసంచా వెలుగులు, విద్యుత్‌దీప కాంతుల్లో జంట రథాలు దేదీప్యమానంగా వెలుగొందాయి. రాత్రి దేవాలయాల ఆవరణల్లో భజన బృందాల ఆధ్వ ర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. జంట రథాల దివ్య రథోత్సవాలను పద్మశాలీయ సంఘీయులు పర్యవేక్షించారు.

ఘనంగా వీరమ్మ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల



తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న ఆనందబాబు

కొల్లూరు, మే 22: మండల పరిధిలోని కొత్తచిలుమూరు గ్రా మంలో వీరమ్మ పేరంటాలమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని సారె బహూకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, మాజీ సర్పంచ్ మొలబంటి రామారావు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంపనిలో నరసింహ జయంతి పూజలు

వేమూరు, మే 22: మండలంలోని జంపని గ్రామంలో బుధవారం నరసింహ జయంతి పర్వదినం సందర్భంగా సీతారామాంజ నేయ కల్యాణ మండపం ప్రాంగణంలో లక్ష్మీ నరసింహ స్వామి పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాములపాటి శివరామకృష్ణ దంపతులు ప్రధాన దాతలుగా పాల్గొన్నారు. భక్తులు విష్ణు సహస్రనామ పారాయణ చేసి గోవింద నామ సంకీర్తన ఆలపించారు.



సుమలత మృతదేహానికి నివాళులర్పిస్తున్న వేగేశన నరేంద్రవర్మ తదితరులు

మాజీ ఎంపీపీ కుమార్తె సుమలత మృతి

కర్లపాలెం, మే 22 : మండలంలోని నల్లమోతువారిపాలెం మాజీ ఎంపీపీ మాడా వెంకటరత్నం కుమార్తె, నల్లమోతువారిపాలెం సర్పంచ్ మాడా సుబ్రహ్మణ్యం సోదరి గరిగంటి సుమలత బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని బాపట్ల కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు నక్కల వెంకటస్వామి తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 23 మే 2024
cinema@andhrajyothy.com



కల్కి... నాకు చాలా లక్కీ

ప్రభాస్

"కల్కి 2898 ఏడీ' చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మా బక్క డైరెక్టర్ (నాగ్ అశ్విన్) బుజ్జితో నన్ను మూడేళ్లు టార్చర్ పెట్టాడు. బుజ్జి (కారు) బ్రెయిన్ చిన్నదైనా నా బుర్రంతా తినేసింది. ఈ సినిమాలో బుజ్జి, భైరవ, నాగ్ అశ్విన్ ప్రతిభ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది' అని ప్రభాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి అగ్రతారలతో రూపొందుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకొనే కథానాయిక. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. జూన్ 27న ఈ చిత్రం విడుదలవుతోంది. భారీ ఖర్చుతో తెరకెక్కిన ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను కూడా వినూత్నంగా భారీతనం ఉట్టిపడేలా నాగ్ అశ్విన్ నేతృత్వంలో చిత్రబృందం నిర్వహిస్తోంది. బుధవారం 'కల్కి' చిత్రబృందం హైదరాబాద్‌లో 'క్యూట్ స్టార్ బుజ్జి' అనే కారును పరిచయం చేస్తూ బుజ్జి వర్సెస్ భైరవ పేరుతో భారీ ఈవెంట్‌ను నిర్వహించింది. చిత్రబృందంతో పాటు ప్రభాస్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుజ్జి కారును నడుపుతూ ప్రభాస్ సందడి చేశారు. దీనికి సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'నేను చాలా లక్కీ. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి దిగ్గజాలతో నటించే అవకాశాన్ని 'కల్కి' నాకు ఇచ్చింది. కమల్‌సార్‌కి వంద దండాలు. ఇండియా గర్వించే నటుడు అమితాబ్. ఆయన స్ఫూర్తితోనే చాలామంది సినిమాల్లోకి వచ్చారు. 'సాగరసంగమం' చిత్రంలో కమల్‌హాసన్‌ను చూసి ఆయన వేసుకున్న దుస్తులు లాంటివి, కుట్టించుకొని వేసుకున్నాను. ఆ సినిమాలోని ఓ పాటలో ఆయన తలను లయబద్ధంగా ఊపే నాట్య భంగిమ చూసి నేను కూడా అలా చేయాలని ప్రయత్నించాను. దీపిక లాంటి ఇంటర్నేషనల్ స్టార్ ఈ సినిమాలో ఉండడం సంతోషం. దిశా అద్భుతమైన నటి. అశ్వనీదత్ గారు ఈ వయసులోనూ చాలా కష్టపడుతున్నారు. ఆయన ప్యాషన్ చూసి చాలా నేర్చుకోవాలి. సినిమా గ్రాండ్‌గా రావడానికి ఖర్చుకు వెనుకాడ లేదు. నిర్మాతగా 50 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో ఉన్నది బహుశా ఆయనొక్కరే. మొదటి చిత్రాన్నే ఎన్టీఆర్‌తో చేశారంటేనే ఆయన రేంజ్ తెలుస్తుంది. వారి కూతుళ్లు స్వప్న, ప్రియాంక గారికి సైతం అదే ప్యాషన్, తెగింపు వచ్చాయి. వారిని చూసి ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని మా చెల్లెళ్లకు చెబుతుంటాను' అన్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'బుజ్జి... పేరు చిన్నగా అనిపిస్తుంది గానీ, అది చేసే పని మాత్రం మామూలుగా ఉండదు. ఈ సినిమాలో బుజ్జి చాలా స్పెషల్. ఇలాంటి కార్‌ను ఇంజనీరింగ్ చేయడం చాలా కష్టం. ఒక కొత్త తరహా కారు తయారు చేయాలంటే పెద్ద టీమ్ ఉండాలి. ఆనంద్ మహీంద్రా గారు ఆ టీమ్‌ను పంపడం వల్లే బుజ్జి అనే కల సాకారమైంది. దీని తయారీలో మా టీమ్ కూడా చాలా కష్టపడింది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ "కల్కి' సినిమా గురించి ఒక్కటే మాట చెబుతాను. ఇది రిలీజయ్యేంత వరకూ చిన్న సినిమా. రిలీజయ్యాక చాలా పెద్ద సినిమా' అని అంచనాలు మరింత పెంచారు.



లవ్ మీ.. ఓ డిఫరెంట్ ఫిల్మ్

టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. విడుదల నేపథ్యంలో హీరో ఆశిష్ బుధవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

- నేను ఇదివరకు చేసిన సినిమాలకు భిన్నంగా డార్క్ తరహాలో నా పాత్ర ఉంటుంది. ఎవరైనా ఓ పని చేయవద్దని చెబితే మొండిగా అదే పని చేసే పాత్ర అది. ఇందులో యూ ట్యూబర్‌గా నటించాను. అతని దగ్గరకి ఓ దెయ్యానికి సంబంధించిన కథ వస్తుంది. అప్పుడు అతని జీవితంలో ఏం జరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు అరుణ్‌తో మాట్లాడి హీరో పాత్ర ఎలా కనిపించాలనుకుంటున్నారో తెలుసుకుని ఆ రకంగా నటించా
- ఈ సినిమాలో ఐదారుగురు హీరోయిన్లు ఉంటారు. అయితే సినిమా మొత్తం వారు కనిపించరు. గెస్ట్‌లా అలా వచ్చి వెళుతుంటారు. ఇందులో వైష్ణవిది దెయ్యం పాత్ర కాదు. దివ్యావతి ఆ పాత్ర పోషించారు. వైష్ణవి మరో కీలక పాత్ర పోషించారు.
- ఇందులో నటించడానికి ముందు 'చంద్రముఖి', 'ముని' వంటి సినిమాలు చాలా చూశాను. ఇందులో హారర్ ఒక భాగం మాత్రమే. మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత ఓ డిఫరెంట్ మూవీ చూశామని ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు.
- దర్శకుడు అరుణ్ నవలా రచయిత. ఈ కథను ఆయన చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. దెయ్యంతో మాట్లాడడం, రొమాన్స్ చేయడం.. వంటి అంశాలు కొత్తగా అనిపించాయి. పీసీ శ్రీరామ్, కీరవాణి వంటి లెజెండ్స్ మా సినిమాకు పని చేయడం అంగీకరించడం మాకు ప్లస్ పాయింట్. దర్శకుడు కథ చెప్పిన విధంగా తీస్తాడా అని ఆలోచించి, మొదట పదిహేను రోజులు షూటింగ్ చేసి, బాగా వచ్చిందంటే ముందుకు వెళదాం .. అనుకున్నాం. ఆ సీన్స్ బాగా రావడంతో ప్రొసీడ్ అయ్యాం.
- ఈ సినిమా తర్వాత సెల్ఫిష్ ఉంటుంది. ఆ తర్వాత సితార బేనర్‌లో ఓ సినిమా చేయబోతున్నా.



మోదీ చిత్రంలో నటించడం లేదు

భారత ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో తను నటించడం లేదని తమిళ నటుడు సత్యరాజ్ స్పష్టం చేశారు. 'ఆ సినిమా గురించి ఇంతవరకూ ఎవరూ నన్ను అడగలేదు. నిరాధారమైన ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో ఆశ్చర్యంగా ఉంది. ఇదంతా సోషల్ మీడియా సృష్టే. ఒకవేళ వారెవరైనా నన్ను అడిగినా ఆ చిత్రం చేయను. నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకోను' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారాయన.

పారిపోయే పిరికిదాన్ని కాదు



'నేను భయంతో పారిపోయే పిరికిదాన్ని కాదు.. నాకు కొంత బ్రీథింగ్ ప్లేస్ కావాలి. అందుకే రెండు రోజుల్లో మీడియా ముందుకు వస్తా. అందరి పని చెప్తా' అన్నారు నటి హేమ. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను పాల్గొనలేదని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆమె మరోసారి స్పష్టం చేశారు. ఈ రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ కూడా ఉన్నారని బెంగళూరు పోలీస్ కమిషనర్ వెల్లడించిన తర్వాత కూడా తను హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ పేర్కొనడం గమనార్హం. రెండు రోజుల నుంచి కొన్ని వందల ఫోన్ కాల్స్‌కు రిప్లయి ఇస్తున్నాననీ, నిజంగా అంత పెద్ద ఇష్యూలో ఉంటే ఫోన్ తన దగ్గర ఎలా ఉంటుంది అని హేమ ప్రశ్నించారు. తన జీవితంతో ఎవరు ఇలా ఆడుకుంటున్నారో, దీని వెనుక ఏ వెధవలు కుట్ర పన్నుతున్నారో కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాననీ, అన్నీ తెలుసుకుని మీడియాకు చెబుతానని ఆమె అన్నారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో నటి హేమ కూడా పాల్గొన్నారనీ, డ్రగ్స్‌తో దొరికారని నటి కరాటే కళ్యాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే పోలీసులకు దొరికిపోయి కూడా హేమ ఇంకా బుకాయిస్తున్నారని 'బిగ్‌బాస్'లో పాల్గొన్న తమన్నా సింహాద్రి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను కూడా ఉన్నానంటూ వచ్చిన వార్తలను యాంకర్ శ్యామల ఖండించారు. ఓ పార్టీకి మద్దతు పలికినందుకే తన గురించి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

ఇకపై థియేటర్లకు పర్సంటేజ్ చెల్లించాల్సిందే



ఇతర రాష్ట్రాల తరహాలో నిర్మాతలు పర్సంటేజీ చెల్లించాలనీ, ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించమని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నష్టాలను తట్టుకోలేక . పదేళ్ల కాలంలో దాదాపు రెండు వేల సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూత పడ్డాయని ఆయన వెల్లడించారు.. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లు, ఎగ్జిబిటర్ల సమస్యలపై ఇటీవల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, పలువురు పంపిణీదారులు, నిర్మాతలు, ఎగ్జిబిటర్స్‌తో సమావేశమై ఎగ్జిబిటర్స్‌కు వాటాలపై కొన్ని ప్రతిపాదనలు తయారు చేశాం. దీనిపై నిర్మాతలకు జులై ఒకటి వరకూ గడువు ఇస్తున్నాం. అయితే 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', 'గేమ్ ఛేంజర్', 'భారతీయుడు 2' చిత్రాలకు మినహాయింపు ఇస్తున్నాం. ఇతర సినిమాలను పర్సంటేజ్ విధానంలోనే ప్రదర్శిస్తాం. కొంతమంది డిస్ట్రిబ్యూటర్స్ సినిమా వ్యాపారాన్ని జూదంలా మార్చారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు ఆటలు ప్రదర్శించం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి బాలగోవింద రాజ్, రవీంద్ర గోపాల తదితర సభ్యులు పాల్గొన్నారు.

నేడు స్వామివార్ల కల్యాణ మహోత్సవం

చెరుకూరు(పర్చూరు), మే 22: పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమస్వామి వారి దేవాలయంలో గురువారం స్వామివార్ల కల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.నాగయ్య తెలిపారు. కల్యాణ కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక సం ఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

ఇంకొల్లు, మే 22 : పావులూరు పొలిమేర వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులకు పలు సేవా సంస్థలు సేవా కార్యక్రమాలను చేపట్టాయి. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. కాకతీయ అన్నదాన సత్రం, నాయీబ్రాహ్మణుల అన్నదానం సత్రంలో తిరునాళ్ల చివరి రోజు గురువారం వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు సత్రం నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ల రెండవ రోజు బుధవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో సేవలు అరకొర

- డాక్టర్లు, సిబ్బంది కొరత
- అందుబాటులో లేని మందులు
- రోగుల ఆందోళన



ఏరియా వైద్యశాలలోని చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లు (ఫైల్)

చీరాల, మే 22 : చీరాల ఏరియా వైద్యశాల కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉంటుంది. అధునాతనమైన భవన సముదాయం. అందులో పలు విభాగాలకు వైద్యసేవలు అందించేందుకు అన్ని వనరులు ఉన్నాయి. అయితే కొంతమేర వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఇదిలావుంటే ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులలో కొన్ని అందుబాటులో లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారిన వాతావరణంతో జెట్టు జలుబులు, జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగింది. చీరాల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు చీరాల ఏరియా వైద్యశాల ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రధాన వనరు. ఈ ప్రాంతంలో పేద, బడుగు, బలహీనవర్గాల వారు అధిక సంఖ్యలో ఉంటారు. వారికి చిన్న సుస్తీ చేసినా, పెద్ద వ్యాధి వచ్చినా వైద్య సేవలు పొందేందుకు ఏరియా వైద్యశాలకు పరుగులు పెడతారు. వైద్యశాలలో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య సేవలు అందించేందుకు వనరులు ఉన్నాయి. ఒక్క గుండెకు సంబంధించి తప్ప మిగిలిన వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. డయాలసిస్ నుంచి సీటీ స్కాన్ వరకు అన్ని రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అన్నీ ఉన్నా ఆసుపత్రిలో నెలకొనే చిన్న, చిన్న సమస్యలతో ఏరియా వైద్యశాల అంటే ప్రజల్లో చిన్నచూపు కలుగుతోంది. ప్రధానంగా కొంతమేర వైద్యులు, సిబ్బంది కొరత అందుకు కారణంగా చెప్తున్నారు. ఇదిలావుంటే రోగులకు అవసరమైన మందులలో కొన్ని రకాలు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు ఆసుపత్రిలో వైద్యం, మందులు, వైద్య పరీక్షలు అన్నీ ఉచితం. అయినప్పటికీ పేదరికంలో ఉన్నవారు కూడా కొన్ని సందర్భాల్లో ఏరియా వైద్యశాలలో వైద్యసేవలు అందక ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నామని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు వైద్యశాల మెడికల్ షాప్‌లో అన్ని రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వెంకట్రావుకు సాయమందిస్తున్న రావినూతల టీడీపీ నేతలు

కార్యకర్త కుటుంబానికి టీడీపీ సాయం

మేదరమెట్ల, మే 22 : రావినూతల గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త ఓరుగంటి వెంకట్రావు గత కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ కిమోథెరపీ చేయించుకుంటున్నారు. బుధవారం రావినూతల తెలుగుదేశం పార్టీ నాయకులు లక్షా50వేల రూపాయలు వెంకట్రావుకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కారుసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి లక్ష్మీనారాయణ, కారుసాల గురుబాబు, చెబ్రోలు నాగేశ్వరరావు, కారుసాల సుబ్బయ్య, అనుబ్రోలు ప్రభాకరరావు, రామినేని శ్రీనివాసరావు, కావూరి వరప్రసాద్‌రావు, పిన్నక రవి, కృష్ణపురపు ఆంజనేయులు, నాగూరి అంజనేయులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించాలి



సర్వేని పరిశీలిస్తున్న ఎంఈవో సుధాకరరావు

అద్దంకిటౌన్, మే 22 : మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి వివిధ లోపాలు కలిగిన 0 నుంచి 18 సంవత్సరాలలోపు ప్రత్యేక అ వసరాలు గల చిన్నారులను గుర్తించి సమీపంలోని పాఠశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈవో-1 గంగాధరరావు, ఎంఈవో-2 బి. సుధాకరరావు సూచించారు. బుధవారం మండలంలోని వేలమూడుపాడు ఎస్సీ కాలనీలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఎంఈవో పరిశీలించారు. మే 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించడంలో భాగంగా ప్రభుత్వం స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటింటి సర్వే ద్వారి వినికిడి లోపం, దృష్టి లోపం, బుద్ధి మాంద్యం, ఆటిజం, శారీరక వైకల్యం వంటి 21 రకాల లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించి వారి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు మండలంలో 25 మంది చిన్నారులను కొత్తగా గుర్తించినట్లు తెలిపారు. 2024-25 సంత్సరానికి గాను చిన్నారులను గుర్తించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు సహకరించాలని, గుర్తించిన చిన్నారులను సాధారణ పాఠశాలలోనే చేర్పించి పేరు నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోను నమోదైన ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలను యూడైస్‌లో తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 9849960723, 9100996459 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ కొంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వేను జాగ్రత్తగా చేయండి

చినగంజాం : గ్రామాల్లో ప్రత్యేక అవసరాలున్న పిల్లల సర్వేని జాగ్రత్తగా నిర్వహించాలని ఎంఈవో-2 ఎస్.కోటేశ్వరావు అన్నారు. మండలంలోని చినగంజాం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక అవసరాలున్న పిల్లల సర్వేని బుధవారం ఎంఈవో-2 బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో గ్రామాలన్నింటినీ రెండు క్లస్టర్లుగా విభజించి, సహిత విద్య రిసోర్సు పర్సన్‌లతో ప్రతిరోజు సర్వే నిర్వహించి, సర్వే నివేదికను ప్రతి రోజు జిల్లా కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు. సర్వే నమోదు వలన ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, ఎస్కార్ట్, రీడర్, బాలకిల స్టైఫండ్, ఉపకరణాలు, బోధనాభ్యాస సామగ్రి, ఫిజియోథెరపీ సేవలు, ప్రత్యేక విద్య ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. సర్వేని పరిశీలించి రిసోర్స్ పర్సన్‌లకు ఆయన పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు టి.బాలకృష్ణ, డి.నాగార్జున పాల్గొన్నారు.

బాలికల వేసవి వాలీబాల్ శిక్షణ ప్రారంభం



వాలీబాల్ శిక్షణను ప్రారంభిస్తున్న అధికారులు

పంగులూరు, మే 22 : మండలంలోని బూదవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన బాలికల వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం పాఠశాల హెచ్‌ఎం బంగారుకొండ ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో నిర్వహించనున్న ఈ బాలికల వాలీబాల్ శిక్షణ శిబిరం మూడు వారాల పాటు కొనసాగుతుందని జిల్లా కోఆర్డినేటర్ పాఠశాల ఫిజికల్ డైరక్టర్ ఎం.వెంకటరావు తెలిపారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుం చి ఎంపికైన 30 మంది బాలికలు శిక్షణ పొందనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎం. ఆంజనేయులు తెలిపారు. ఈ శిబిరంలో శిక్షణ పొందే బాలికలు క్రీడలో మెలకువలు తెలుసుకుని శిక్షణ ద్వారా క్రీడలో ఎదిగి రాణించాలని అంజనేయులు ఆకాంక్షించారు. ఈ శిక్షణ శిబిరానికి కోచ్‌గా స్పోర్ట్ అథార్టీ ఆఫ్ ఇండియా కోచ్ కేవీ రమణలు వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి నరసింహారావు ఉప సర్పంచ్ గాదె బ్రహ్మారెడ్డి, పీసీ చైర్మన్ ఈమని శ్రీరాములురెడ్డి, గ్రామ పెద్దలు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, బలరామిరెడ్డి, బుల్లిరెడ్డి, రాఘవరెడ్డి శ్రీనివాస రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

ఇంకొల్లు, మే 22 : ఇంకొల్లులోని పావులూరురోడ్డులో ఉన్న పోలేరమ్మ ఆలయంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగు చూపింది. బుధవారం గుడికి కరి నాగేంద్రమ్మ అనే మహిళ శుభ్రం చేయడానికి వచ్చి చూడగా విగ్రహానికి ఉన్న వెండి, బంగారు వస్తువులు అపహరించినట్లు గుర్తించి ఆలయకమిటీ సభ్యులకు తెలిపింది. వీటి విలువ సుమారు రూ.2.20లక్షలు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

బస్సు మారిన మహిళ

పోలీసుల జోక్యంతో క్షేమంగా చేరిక

మార్టూరు, మే 22 : మండలంలోని ఇసుక దర్శి గ్రామానికి చెందిన మారెళ్ల మల్లీశ్వరి అనే మహిళ సుమారు 40 మంది గ్రామస్థులతో కలిసి ఈ నెల 18 వ తేదీన ప్రైవేటు బస్సులో కాశీకి వెళ్లారు. బుధవారం ఉదయం జార్ఖండ్‌లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి బస్సు నుంచి గ్రామస్థులతో పాటు దిగిన మల్లీశ్వరి తిగిరి బస్సు ఎక్కే క్రమంలో బస్సును గుర్తించలేక ఇతర రాష్ట్రానికి చెందిన మరో బస్సు ఎక్కారు. అయితే మల్లీశ్వరికి తమ బస్సు వివరాలు, గ్రామస్థుల ఫోన్ నంబర్లు కూడా తెలియకపోవడంతో సమాచరం చెప్పలేకపోయింది. భాష సమస్య కూడా ఎదురైంది. అదే సమయంలో ప్రొద్దుటూరుకు చెందిన మరో బస్సులోని ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి, మల్లీశ్వరితో మాట్లాడి గూగుల్ ద్వారా మార్టూరు పోలీస్ స్టేషన్ సీఐ రాజ శేఖర్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. దాంతో వెంటనే సీఐ ఇసుకదర్శి గ్రామంలోని మహిళా పోలీస్ ఎం.నిర్మలకు సమాచారం ఇచ్చారు. ఆమె మల్లీశ్వరి కుటుంబ సభ్యులతో మాట్లాడడంతో వారు వెంటనే ఆమె వెళ్లిన బస్సులోని గ్రామస్థులు, డ్రైవర్‌తో మాట్లాడారు. అనంతరం బస్సు డ్రైవరు మల్లీశ్వరి ఉన్న ప్రాంతానికి వెళ్లి ఆమెను తమ బస్సులోకి ఎక్కించుకోవడంతో కథ సుఖాంతమైంది.



మాట్లాడుతున్న ఐక్య వేదిక నాయకులు

అధికారులపై వివక్ష తగదు

- కుల వివక్ష చూపుతూ బదిలీలు దారుణం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

అద్దంకిటౌన్, మే 22 : ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ అధికారులపైనే వివక్ష పూరింతంగా వ్యవహరిస్తూ వారిని మాత్రమే సస్పెండ్, బదిలీలు చేయడం దారుణమని, వాటిని ఆపాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. బుధవారం అంబేడ్కర్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం వారిని మాత్రమే బదిలీ చేయడం ఓసీ అధికారులను సమర్థిస్తున్నట్లు, వారిని వెనకేసుకొస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి నివేదికలు పంపడం, సీఈసీ దానిని అమలు చేస్తూ విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. పల్నాడు కలెక్టర్ శివశంకర్‌ను ఏ తప్పు చేయకపోయినా కేవలం ఎస్సీ అనే భావనతో విధులకు దూరం చేయడం దుర్మాగమని, దినిని ఐక్య వేదిక ఖండిస్తుందని, వారిని వెంటనే విధులలోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్.నాగేశ్వరరావు, జె.శ్రీమన్నారాయణమూర్తి, రాధాకృష్ణమూర్తి, బుజ్జిబాబు, హనుమంతరావు, విశ్వతేజ ఉన్నారు.

నిబంధనల మేరకు ధ్రువ పత్రాలివ్వాలి

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి



వైద్యులతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, మే 22 : జనన, మరణ ధ్రువపత్రాలను అక్టోబర్ - 2023 నుంచి అమలులోకి వచ్చిన పద్ధతి మేరకు అందజేయాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. కార్యాలయంలో బుధవారం పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల వైద్యులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు జనన, మరణ వివరాలు సీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియలో జాప్యం చేయడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుందని సూచించారు. అనంతరం పట్టణంలో డెంగ్యూ ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ సెక్రటరీలకు, వార్డు సెక్రటరీలకు సూచించారు. విధిగా చెత్త సేకరణ జరగాలని, పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ ఉండకూడదని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా జీవించండి



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ

చీరాలటౌన్, మే 22 : ప్రజలు వ్యక్తిగత లేక రాజకీయాల నేపథ్యంలో అసూయ అపోహలు వీడి శాంతియుతంగా జీవించాలని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం వన్‌టౌన్ పరిధిలోని ఉజిలీపేట, హరిప్రసాద్‌నగర్, టూటౌన్ పరిధిలోని శృంగారపేట, రూరల్ పరిధిలో గవినివారి పాలెంలో ఎస్సై రత్నకుమారి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు ఆయా ప్రాంతాల్లో మారణాయుధాలను ఇంటి సమీపంలో ఉంచకూడదని హెచ్చరించారు. లూజు పెట్రోల్ వంటి వాటిని నిశితంగా పరిశీలించారు. రౌడీ షీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాల్లో భాగస్వాములయి శిక్షలు అనుభవించడం అవివేకమని హితవు పలికారు. కుటుంబాలతో శాంతియుతంగా జీవించాలని సూచించారు. భిన్నంగా వ్యవహరిస్తే కేసులతో పాటు జిల్లా బహిష్కరణ ఉంటుందని సీఐ హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఆయా స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, మే 22 : చినగంజాం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యూటీ వరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియామావళికి లోబడి సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొన్నాలని ఎంపీడీవో కోరారు.

ఉచిత మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

అద్దంకిటౌన్, మే 22 : అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయిని యనమండ్ర వరలక్ష్మి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ డీఎం రామ్‌మోహనరావు, అసిస్టెంట్ మేనేజర్ మహబూబీ ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్, మహమ్మద్ రఫీ, సెక్రటరీ వీరయ్య, డాక్టర్ యూ దేవపాలన, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుని జయంతి



ఉత్సవమూర్తులను కల్యాణ వేదిక వద్దకు తీసుకువస్తున్న భక్తులు

అద్దంకిటౌన్, మే 22 : శింగరకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి మహోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు స్వామివారిని విశేషంగా అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, కల్యాణం తిలకించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్. కోటిరెడ్డి, పాలక మండలి చైర్మన్ ఎన్.కొండలరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పంగులూరు : మండలంలోని రామకూరు గ్రామంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి జయంతి సందర్భంగా బుధవారం ఆలయంలో పుణ్యాహవాచనం, అభిషేక కార్యక్రమం, శాంతి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి ఆత్మకూరి లక్ష్మీ తులసిరావు నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిగిన జయంతి వేడుకలలో ఒంగోలు మున్సిపల్ మాజీ చైర్మన్ యక్కల తులసీరావు దంపతు లు, యక్కల వంశస్తులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు లక్ష తమలపాకుల పూజ

పౌర్ణమి సందర్భంగా గురువారం శింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారికి లక్ష తమలపాకుల పూజ వేదపండుతులు, అర్చకులచే జరుగుతుందని ఆలయ ఈవో టీ సుభద్ర బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి పూజా కార్యక్రమం జరుగుతుందని భక్తులు అందరు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి దర్శించుకోవాలని ఆమె కోరారు.



బొల్లాపల్లి కొండపై నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కనులపండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మార్టూరు : మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో బుధవారం కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణానికి గ్రామంలోని 25 మందికిపైగా జంటలు పీటలపై కూర్చున్నారు. మరికొంత మంది భక్త లు స్వామి వారికి తలంబ్రాలు, తాళిబొట్టు, నూతన వస్త్రాలను అంద చే శారు. ఆలయ అర్చకులు ముప్పాళ్ల హరిప్రసాద్ బాబు గ్రామస్థుల సహకారంతో దేవదాయ జూనియర్ అసిస్టెంట్ సందీప్ పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం కనులపండుగగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిల కించడానికి వచ్చిన భక్తులు మొదటిగా దేవస్థానంలోని మూలవిరాట్ లక్ష్మీ నరసింహస్వామి విగ్రహాలను దర్శించుకున్నారు. అనంతరం ధ్వజ స్తంభం వద్ద కొబ్బరి కాయలు కొట్టి పంచ ముఖ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కల్యాణం కించడానికి బొల్లాపల్లి, కోనంకి, కోలలపూడి, తాటివారిపాలెం గ్రామస్థులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి గ్రామంలో గరుడ వాహనంపై లక్ష్మీ నరసింహస్వామి దంపతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేశారు. ప్రధాన వీధులలో ఊరేగింపుగా వచ్చిన స్వామి వారిని దర్శించుకొని ప్రజలు పులకరించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

శోభాయమానంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో పార్వతీమాత

పంగులూరు, మే 22 : మండల కేంద్రమైన పంగులూరులో శ్రీ భీమలింగేశ్వరస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. మూడవ రోజు బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వా మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బ్రహ్మశ్రీ శైవగామ పండితులు పేటేటి ఉదయభాస్కర శర్మ నేతృత్వంలో నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం, బలిహరణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ అవధూతేంద్ర భక్త మండలి వారు శివ నామాన్ని జపిస్తూ ఏకాహ కార్యక్రమం చేపట్టారు. ఈవో శ్రీనివాసరావు కార్యక్రమాలను ప ర్యవేక్షించారు. శాస్త్రోక్తంగా జరిగిన పూజా కార్యక్రమాలలో ఆలయ అర్చక స్వాములు చందలూరి సునీల్ కుమార్ శర్మ, కారంచేటి సాంబశివరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

30 నుంచి శింగరకొండలో హనుమత్ జయంతి

అద్దంకిటౌన్, మే 22 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు హనుమత్ జయంతి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయక కమిషనర్ టి.సుభద్ర బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. 30 తేదీ ఉదయం 8 గంటల నుంచి స్వామివారి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, 31వ తేదీ ఉదయం 9 గంటలకు మన్యుసూక్త హోమం, పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే జూన్ 1వ తేదీ శనివారం హనుమత్ జయంతి సందర్భంగా ఉదయ 4.45 నిమిషాల నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కావున భక్తులందరూ స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందాలని ఆమె కోరారు.

పంట కాలువలో పూడికతీత

- పనులు చేయించిన ఉత్తర అమెరికా సంఘం
- మన గ్రామం.. మన బాధ్యత కింద అభివృద్ధి
- నాట్స్ అధ్యక్షుడు బాపయ్యను సన్మానించిన గ్రామస్థులు



పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న నాట్స్ అధ్యక్షుడు బాపయ్య

బల్లికురవ, మే 22 : వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేలా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో పంట కాలువలలో పూడి కతీ పనులు చేపట్టారు. మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన మాదాల రాజేంద్ర ఉత్తర అమెరికాలో స్థిరపడ్డారు. పలు సమస్యలను రైతులు నాట్స్ సంఘం దృష్టికి తీసుకు వెళ్లగా ఆ సంఘ అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి మన గ్రామం. మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం గుంటుపల్లి గ్రామంలో పంట కాలువలో పూడిక తీత పనులను రైతుల సమక్షంలో చేపట్టారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్‌ఆర్ఐ ఉద్యోగులు ఎక్కడ స్థిరపడినా పుట్టిన గ్రామాలపై మమకారం ఉంటుందన్నారు. తెలుగు సంఘం నాట్స్ ఆధ్వర్యంలో కొంతకాలంగా గ్రామీణ ప్రాంతాలలో సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. గుంటుపల్లి నుంచి కొత్తపాలెం వరకు సాగర్ నీరు వచ్చే పంట కాలువను అభివృద్ధి పరిచి 250 ఎకరాలకు సక్రమంగా నీరు అందించేలా చర్యలు చేపట్టి రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. గతంలో కూడా రోడ్ల వెంబడి ఉన్న తుమ్మ చెట్లను తొలగించామన్నారు. దేవాలయాల అభివృద్ధికి నిధులు అందించామన్నారు. ఈ సందర్భంగా గుంటుపల్లి గ్రామానికి వచ్చిన తెలుగు సంఘం అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరికి రైతులు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, గ్రామ పెద్దలు మాదాల సాంబయ్య, గొల్లపూడి పూర్ణయ్య, రైతులు చల్లగుండ్ల రాంబాబు, దూళిపాళ్ల పున్నారావు పాల్గొన్నారు.